సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం, 23, ఏప్రిల్, 2025

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు



- వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- పెండింగ్‌లో ఉన్న పర్యాటక అభివృద్ధి పనులపై దృష్టిసారించండి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- వివరాలు 10లో..

మెరుగుపడింది

ఇంటర్ ఫలితాలు విడుదల

- గతేడాదితో పోలిస్తే పెరిగిన ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 62.78, సెకండియర్‌లో 69.59 శాతం
- మరోసారి బాలికలదే పైచేయి
- వచ్చే నెల 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ ఫలితాలు ఇలా...

ఫస్టియర్ విద్యార్థులు **8917** | పాసైన వారు **5598**

	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	4,030	2,110	52.36
బాలికలు	4,887	3,488	71.37

సెకండియర్ విద్యార్థులు **8225** | పాసైన వారు **5724**

	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	3,772	2243	59.46
బాలికలు	4453	3481	78.17

- వివరాలు 10లో..



వాగ్దేవి కళాశాలలో ఫలితాలను చూసుకుంటున్న విద్యార్థులు

సివిల్స్‌లో మెరిసిన పాలమూరు బిడ్డలు

- నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ముగ్గురికి మెరుగైన ర్యాంకులు
- మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మరో యువకుడి ప్రతిభ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నలుగురు యువకులు సివిల్స్‌లో సత్తాచాటారు. మంగళవారం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్రాబాద్ మండలం మన్ననూరుకు చెందిన మండలి సాయికిరణ్ ఆలిండియా 298వ ర్యాంక్ సాధించారు. అలాగే వెంకటేష్‌ప్రసాద్ (700ర్యాంక్), యశ్వంత్‌నాయక్ (432 ర్యాంక్), ఆంజనేయులు (934 ర్యాంక్) సాధించారు. - సాక్షి నెట్‌వర్క్



మండలి సాయి కిరణ్
298 ర్యాంక్



వెంకటేశ్ ప్రసాద్ సాగర్
700 ర్యాంక్

- వివరాలు 10లో..

క్లుప్తంగా

అనవసర భయం విద్యార్థి ప్రాణం తీసింది..

- ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత సాధించిన మల్లెందొడ్డి విద్యార్థి


వినోద్ (ఫైల్)

మల్దకల్: ఇంటర్‌లో ఫెయిల్ అవుతానేమో నన్న భయంతో మల్దకల్ మండలంలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అయితే సదరు విద్యార్థి మంగళవారం విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామానికి చెందిన వినోద్ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ వార్షిక పరీక్షల అనంతరం విద్యార్థి తాను రాసిన పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో వినోద్ పాస్ కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అనవసర భయమే తమ బిడ్డ ప్రాణం తీసిందని వాపోయారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

రాజోళి: తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మాన్‌దొడ్డికి చెందిన నడిపి ఆంజనేయులు (52) కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వాడు. ప్రస్తుతం తాటిముంజల సీజన్ కావడంతో, వాటిని విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే గ్రామ సమీపంలో తాటికాయలు తెంచేందుకు చెట్టుపైకి ఎక్కిన ఆయన.. ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మెరుగుపడింది

ఇంటర్ ఫలితాలు విడుదల

- గతేడాదితో పోలిస్తే పెరిగిన ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 62.78, సెకండియర్‌లో 69.59 శాతం
- మరోసారి బాలికలతో పైచేయి
- వచ్చే నెల 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. గత ఏడాదితో పోల్చితే ఉత్తీర్ణత శాతం ప్రథమ సంవత్సరంలో 8.84 శాతం, ద్వితీయ సంవత్సరంలో 5.32 శాతం పెరిగింది. ఎప్పటిలాగే మరోసారి ఉత్తీర్ణతలో బాలికలు పైచేయి సాధించారు. గతేడాది జనరల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 20వ స్థానం, సెకండియర్‌లో 22వ స్థానం వచ్చింది. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 10వ స్థానం, రెండో సంవత్సరంలో 12వ స్థానం దక్కింది. దీంతో జిల్లావ్యాప్తంగా చాలా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సైతం మార్కుల్లో పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 4వ స్థానం రాగా, రెండో సంవత్సరం 7 స్థానం లభించింది. జనరల్ కోర్సుల్లో గతేడాది మొదటి సంవత్సరంలో మొత్తం 53.94 శాతం ఉత్తీర్ణగా ఉండగా, ఈ ఏడాది 8,917 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 5,598 మంది ఉత్తీర్ణత సాధించి 62.78శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గతేడాది 64.21శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈ సంవత్సరం మొత్తం 8,225 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 5,724 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 69.59శాతం ఉత్తీర్ణత పొందారు.

■ మొదటి సంవత్సరం జనరల్ కోర్సుల్లో బాలురు 4,030 మంది పరీక్షలకు హాజరు కాగా 52.36 శాతంతో 2,110 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 4,887 మంది పరీక్షలు రాయగా 71.37 శాతంతో 3,488 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురతో పోలిస్తే 19.01శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. ఒకేషనల్‌లో బాలురు 817 మంది పరీక్షలు రాస్తే 53.39 శాతంతో 462 మంది ఉత్తీర్ణులు కాగా.. బాలికలు 1,135 పరీక్షలు రాయగా.. 84.05 శాతంతో 954 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 30.66 అధికంగా ఉంది.

■ రెండో సంవత్సరం జనరల్ కోర్సుల్లో 3,772 మంది బాలురు పరీక్షలు రాయగా.. అందులో 59.46 శాతంతో 2,243 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 4,453 మంది పరీక్షలకు హాజరు కాగా 78.17శాతంతో 3,481 మంది ఉత్తీర్ణతను నమోదు చేశారు. మొత్తం 18.71శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణతనునమోదు చేశారు. ఒకేషనల్ విభాగంలో 681 మంది బాలురు పరీక్షలు రాయగా 66.67 శాతంతో 454 మంది విద్యార్థులు.. బాలికలు 1,040 మంది పరీక్షలు రాయగా అందులో 88.27శాతంతో 918 మంది ఉత్తీర్ణత పొందారు. బాలురతో పోలిస్తే 21.62శాతం అధికంగా ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు.

■ మే 22వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల23 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటితో పాటు రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు గురుకులాల్లో వందశాతం..

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని10 మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. మహబూబ్‌నగర్ బాలికల-2 ఒకేషనల్ (ఏటీ, సీజీటీ) కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం, జడ్చర్ల బాలికల-1 కళాశాల ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ మేరకు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులను ఆర్ఎల్‌సీ ఖాజా బాహుద్దీన్ అభినందించారు.

సాఫ్ట్‌వేర్ కావాలని..



ఇంటర్‌లో చేరినప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చదవాలనే లక్ష్యంతో చదివాను. అందుకోసం అధ్యాపకులు చెప్పే ప్రతి అంశాన్ని నోట్ చేసుకొని పరీక్షలకు సిద్ధమయ్యాను. సందేహాలు వచ్చిన ప్రతిసారి సార్ వాళ్లు నివృత్తి చేసే వారు. ఫిజిక్స్, మ్యాథ్స్‌లో కొత్త అంశాలను నేర్చుకునేందుకు అవకాశం దొరికింది.
– బి.అక్షత, ఎంపీసీ (994), ప్రతిభ కళాశాల

రోజు 10గంటలు చదివాను..



ఎక్కువ మార్కులు సాధించాలనే లక్ష్యంతో రోజు 10 నుంచి 12 గంటల వరకు ప్రిపరేషన్‌కు సమయాన్ని కేటాయించాను. మా నాన్న ఆటో డ్రైవర్. ఎంతో శ్రమకోర్చి నన్ను చదివిస్తున్నారు. నా తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు కచ్చితంగా ఎంసెట్, నీట్‌లో సీటు సాధించే లక్ష్యంతో ప్రిపరేషన్ కొనసాగిస్తాను.
– ఏ.అక్షిత, బైపీసీ (994) ప్రతిభ కళాశాల

డాక్టర్ అవుతా..



మా కుటుంబ సభ్యులకు నేను డాక్టర్ కావాలని కోరిక. అందుకోసం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో సిద్ధం అవుతున్నా. మంచి మార్కులు సాధించేందుకు అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం సహకారం ఎంతో ఉంది.
– నెక్కొండి హాసిని, బైపీసీ (436), ప్రతిభ కళాశాల

లక్ష్యంపై దృష్టి..



మొదటి సంవత్సరం ప్రారంభం నుంచి మంచి మార్కులు సాధించేందుకు కసరత్తు చేస్తున్నా. గతంలో ఎక్కువగా వచ్చిన ప్రశ్నలపై దృష్టి సారించి చదివాను. కుటుంబ సభ్యులు, అధ్యాపకుల సహకారంతో అనుకున్న విధంగా మంచి మార్కులు సాధించాను. భవిష్యత్‌లో మరింత మెరుగ్గా రాణించేందుకు కష్టపడతాను.
– భవన, ఎంపీసీ (468), రిషి కళాశాల

ప్రిపరేషన్‌కు ప్రాధాన్యత..



ఇంటర్‌లో అనుకున్న మార్కులు సాధించేందుకు చాలా కష్టపడ్డాను. కళాశాలలో తరగతులు పూర్తయ్యాక. గతంలో వచ్చిన ప్రశ్నలు చూడటం.. ముఖ్యమైన వాటిని నోట్ చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం కలిగింది. ఇంటి వద్ద సమయం వృథా చేయడకుండా ప్రిపరేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చాను. ఇంజినీరింగ్ చదవాలని ఉంది.
– నవనీత్‌గౌడ్, ఎంపీసీ (992), వాగ్దేవి కళాశాల

కుటుంబ సభ్యుల సహకారంతో



నేను అత్యధిక మార్కులు సాధించేందుకు మా కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారు. కళాశాలలో తరగతులు పూర్తయ్యాక ఉదయం, సాయంత్రం ప్రిపరేషన్ కోసం చాలా శ్రమించాను. ప్రస్తుతం నీట్‌లో ర్యాంక్ సాధించేందుకు ప్రిపేర్ అవుతున్నా. కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల సహకారంతో మంచి ర్యాంక్ సాధించి.. సీటు కూడా సాధిస్తాను.
– మలిహా కెహకష్, బైపీసీ (438), రిషి కళాశాల

అధ్యాపకుల ప్రోత్సాహంతో..



మంచి మార్కులు సాధించేందుకు కళాశాల అధ్యాపకులు ఎంతో ప్రోత్సహించారు. ప్రిపేర్ సమయంలో సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పలు టిప్స్ ఇచ్చారు. వాటి వల్ల ప్రిపరేషన్ చాలా సులువుగా కొనసాగింది. ఇదే స్ఫూర్తితో రెండో సంవత్సరంలో కూడా మంచి మార్కులు సాధించే విధంగా కృషి చేస్తాను.
– అమీనా, ఎంపీసీ (468), వాగ్దేవి కళాశాల

ప్రణాళికా బద్ధంగా..



సిలబస్‌లోని ప్రతి అంశాన్ని ప్రణాళికా బద్ధంగా చదివాను. అందుకోసం అధ్యాపకులు, యాజమాన్యం సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయి. జేఈఈ సీటు సాధించాలన్న లక్ష్యం చదువుతున్నా. కొన్ని రోజుల పాటు ఫోన్, టీవీకి దూరంగా ఉండడం వల్ల చాలా సమయం కలిసివచ్చింది.
– మేఘన, ఎంపీసీ (993), రిషి కళాశాల

నీట్ ర్యాంక్ సాధిస్తా..



నీట్‌లో మంచి ర్యాంక్ సాధించేందుకు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై దృష్టి సారించా. సబ్జెక్టుపై మంచి పట్టు సాధిస్తే నీట్ ర్యాంక్ సాధించడం చాలా సులువు అవుతుందనే ఉద్దేశంతో సమయం వృథా చేయకుండా చదివాను. కళాశాల యాజమాన్యం తీసుకునే ప్రత్యేక శ్రద్ధ చాలా ప్రభావం చూపింది.
– సంజన, బైపీసీ (436) వాగ్దేవి కళాశాల

సివిల్స్‌లో మెరిసిన పాలమూరు బిడ్డలు



సాక్షి, నాగర్‌కర్నూల్/వెల్దండ/వంగూరు/అడ్డాకుల: యూపీఎస్సీ ఫలితాల్లో పాలమూరు బిడ్డలు సత్తా చాటారు. నల్లమలలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన మండలి సాయికిరణ్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా 298 ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ, ఎంబీఏ పూర్తిచేసిన సాయికిరణ్.. తొలి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం విశేషం. సాయికిరణ్ తల్లి పుష్పమ్మ గృహిణి కాగా.. తండ్రి మండలి లింగమయ్య ప్రస్తుతం పెద్దకొత్తపల్లి మండలంలో ఎంపీఓగా పనిచేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నా..

నాకు చిన్నప్పటి నుంచి సివిల్స్ సాధించాలని లక్ష్యం ఉండేది. హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాక.. ఎంబీఏ చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధం అయ్యాను. ఏడాదిపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుని ఇంటి వద్దే ఉండి ప్రిపేర్ అయ్యాను. నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడం ఆనందంగా ఉంది. – సాయికిరణ్, మన్ననూర్



■ మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మునుగల్‌చేడ్ సత్యయ్య, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ జాతీయ స్థాయిలో 700 ర్యాంకు సాధించారు. గత మార్చి 30న విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించిన అతడు.. ఈసారి యూపీఎస్సీ ఫలితాల్లోనూ సత్తా చాటారు. ఆయన అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విద్యా సంస్థల్లో ఇంటర్(ఎంపీసీ), డిగ్రీ(బీఎస్సీ ఫిజిక్స్), పీజీ పూర్తి చేశారు. మొదటిసారి యూపీఎస్సీ పరీక్ష రాసి 700 ర్యాంకు సాధించారు. ఇదిలా ఉంటే, వెంకటేశ్ ప్రసాద్ తండ్రి సత్యయ్య ప్రస్తుతం కోయిలకొండ మండలంలో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తుండగా.. తల్లి యశోద గృహిణి. పదేళ్లుగా సత్యయ్య కుటుంబంతో కలిసి మహబూబ్‌నగర్‌లోని శేషాద్రినగర్‌లో నివాసముంటున్నారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం..

అమ్మా, నాన్న పోత్సాహంతో చదువులో రాణించాను. దూర ప్రాంతాల్లో నా విద్యాభ్యాసం పూర్తిచేశాను. యూపీఎస్సీ పరీక్ష కోసం ఢిల్లీలోని వాజీరాం కోచింగ్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నా. 15 నెలలపాటు కోచింగ్ తీసుకుని పరీక్ష రాస్తే 700 ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం. ఇందుకోసం మరోసారి ప్రయత్నం చేస్తాను. – ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ ,నిజాలాపూర్

మెరుగుపడిన ర్యాంకు



వెల్దండ మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన వడ్యావత్ యశ్వంత్ నాయక్ సివిల్స్ ఫలితాల్లో 432వ ర్యాంకు సాధించారు. ఆయన గతేడాది యూపీఎస్సీ ఫలితాల్లో 627వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌గా మహారాష్ట్రకు ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నారు. ఐఏఎస్ లక్ష్యంగా మరోసారి యూపీఎస్సీ పరీక్ష రాసి.. మెరుగైన 432వ ర్యాంక్ సాధించారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని యశ్వంత్ నాయక్ చెప్పారు. కాగా, యశ్వంత్ తండ్రి ఉమాపతి హైదరాబాద్‌లో ఎస్బీఐ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్, ఐఐటీ మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు.

934వ ర్యాంకు



■ వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన గోకమొల్ల ఆంజనేయులు పట్టుదలతో చదివి ఆలిండియా 934వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆంజనేయులు.. 1నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామమైన తిప్పారెడ్డిపల్లిలో.. 8నుంచి 10వ తరగతి వరకు గాజరలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్, ఐఐటీని కడప జిల్లా ఇడుపులపాయలో పూర్తిచేశారు. అనంతరం హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. సివిల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటడంతో ఆయన తల్లిదండ్రులు శ్రీనివాసులు, కృష్ణమ్మతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

'పాలమూరు' పనుల పరిశీలన


పాలమూరు ఎత్తిపోతల ప్యాకేజీ-1 జీరో పాయింట్ వద్ద ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్ కుమార్

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు సమీపంలో చేపట్టిన పాలమూరు ప్రాజెక్టు మొదటి లిఫ్ట్ పనులను ఈఎన్‌సీ అనిల్ కుమార్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా 1, 2, 3 ప్యాకేజీల పనుల పురోగతిని తెలుసుకున్నారు. 3వ ప్యాకేజీ పనులను డ్రోన్ కెమెరాలతో పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు ప్రధాన కాల్వ పనులను పరిశీలించారు. పంప్‌హౌజ్, ప్రధాన కాల్వ హెడ్ రెగ్యులేటరీ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కేఎల్ఐ మొదటి లిఫ్టును సందర్శించి.. పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 817 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కరివెన, వట్టెం రిజర్వాయర్ల పనులను త్వరగా పూర్తి చేసి.. 50 టీఎంసీల నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ.మధుసూదన్‌రెడ్డి

- వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- పెండింగ్‌లో ఉన్న పర్యాటక అభివృద్ధి పనులపై దృష్టిసారించండి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించవద్దని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కష్ణారావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలకు ఇబ్బంది లేదని, నిర్వహణలో మాత్రం కొన్ని లోపాలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించి వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు రూ.కోటి నిధులు మంజూరు చేశారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంలో నిర్ణీత తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు ఉంటే త్వరగా తూకం వేయాలన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కేంద్రాల నిర్వాహకులే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షణ పెంచనున్నట్లు చెప్పారు. గత యాసంగి ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ అప్పగించని మిల్లర్ల నుంచి రూ. 150కోట్ల మేర బకాయిలు రికవరీ చేయాలని.. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై మంత్రి సమీక్షించారు. పిల్లలమర్రి, కోయిల్‌సాగర్‌కు ప్రభుత్వం మంజూరుచేసిన పనులకు వెంటనే టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. మినీ శిల్పారామంలో ఉన్న ఆడిటోరియంలో సౌండ్ ప్రూఫ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని పర్యాటక అభివృద్ధిశాఖ ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. మన్యంకొండలో హరిత హోటల్, కల్యాణ మండపం నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, ఐ లాండ్ పనులకు మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

■ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. శిల్పారామం నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. శిల్పారామానికి అవసరంలేని స్థలాలను తిరిగి యజమానులకు అప్పగించాలని అధికారులకు సూచించారు. కాగా, శిల్పారామం ప్లాట్ల విషయంలో వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. రూ. 48.99 కోట్లతో పెద్ద చెరువు వద్ద ఐల్యాండ్, సుందరీకరణ, నెక్లెస్ రోడ్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో ప్రతిపాదనలు రూపొందించగా.. రూ. 7కోట్లతో పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. మన్యంకొండ వద్ద నిర్మించే హోటల్‌లో అన్నిరకాల వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి పనులు, కోయిల్‌సాగర్ పర్యాటక పనులు చేపట్టాలని కోరారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయండి

డీజీపీని కలిసిన ఎంపీ డీకే అరుణ, ప్రశాంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: దేవరకద్ర బీజేపీ నేత హత్యకు చేసిన కుట్ర వ్యవహారంపై మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్రలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా రూ. 2.50కోట్లకు సుఫారీ ఇచ్చి కుట్ర చేసినట్లు అనుమానం ఉందన్నారు. దేవరకద్ర, మహబూబ్‌నగర్ పరిసరాల్లో కొన్ని రోజుల నుంచి ప్రశాంత్‌రెడ్డి కదలికలపై రెక్కీ నిర్వహించారన్నారు. భూత్పూర్ పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు ఉన్నట్లు ఎంపీ తెలిపారు. ఈ కుట్ర వెనుక ఎవరి హస్తం ఉందనే విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని డీజీపీని కోరారు.

'వాగ్దేవి' విద్యార్థుల విజయ దుందుభి


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, యాజమాన్య సభ్యులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో అమీనా 468, అక్షయశ్రీ 466, అమృత వర్షిణి 465, వైశాలి 465 మార్కులు సాధించగా.. బైపీసీ విభాగంలో సంజన 436, అలానే ఫరీహ 435, పాయల్ సింగ్ 435, మదియా తరహ 435 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో నవనీత్‌గౌడ్ 992, బైపీసీ విభాగంలో రబ్‌షా 991, సపూరా 989 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, అకాడమిక్ ఇన్‌చార్జి పావని, కోట్ల శివకుమార్, రాఘవేందర్‌రావు, నాగేందర్, సతీశ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జ్యోతినందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'రిషి' సంచలనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సంచలనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటినట్లు కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళా వెంకటయ్య తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో భావన 468 మార్కులు సాధించగా.. మరో ఏడుగురు విద్యార్థులు 467 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీలో మలిహ కెహకశ 438 మార్కులు సాధించగా.. ముగ్గురు 437, మరో ముగ్గురు 436 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మేఘన 993తో పాటు మరో ఐదుగురు 990 మార్కులు సాధించారు. బైపీసీలో మలిహ తహనీయత్ 992 మార్కులు, మరో ఐదుగురు 990 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల అడ్వైజర్ వెంకటయ్య, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ' విద్యార్థుల విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ఫస్టియర్ ఎంపీసీలో వైష్ణవి 468, ఉపేంద్ర 468, విజయలక్ష్మి 467, గణేశ్ 467, అక్షితారెడ్డి 467, సాయిచరణ్ 467, కీర్తి 466, భవనేష్ 466, అయిసా తహరీన్ 466, హర్షిత 466, వర్షిణి 466, హూరియా రశీద్ 466, విశాల్ 466, శోభారాణి 466, నవీన్‌కుమార్ 466, శ్రీనితీన్ 466, త్రిష 466 మార్కులు సాధించారు. బైపీసీలో నెక్కొండ హాసి 436, వైష్ణవి 436, సుప్రజ 435 మార్కులతో ప్రతిభ చాటారు. సెకండియర్‌లో ఎంపీసీలో అక్షిత 994, అమోఘ్ 993, భవిత 992, శివజ్యోతిక 992, అమిమ ఫాతిమా 992, వర్షిత్‌గౌడ్ 992 మార్కులు, బైపీసీ విభాగంలో అక్షిత 994, అజీం కౌసర్ 991, జైనబిన్ మొహమ్మద్ 990, భూమిక 990 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 400 పైగా 514మంది, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా 432 మంది సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గౌరవ సలహాదారు మంజూలాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.